కిమ్ జాంగ్ ఉన్ బతికే ఉన్నాడు.. వదంతులపై స్పష్టతనిచ్చిన ఎన్ఐఎస్

నిప్పులాంటి నిజాల ప్రతిబింబం

నిలువుటద్దం

విలేకరులు కావలెను...

సంచలన దినపత్రిక నిలువుటద్దం కు – తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా జిల్లాల వారీగా, మండలాల వారీగా పనిచేయుటకు రిపోర్టర్లు కావలెను.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్
9059548848

హైదరాబాద్. | ఎడిటర్:- వై. రమ నాగరాజు | సంపుటి:-32 | సంచిక:-238 | శనివారం 24-10-2026

బీసీ కులగణనలో తమ వివరాలు నమోదు కాలేదని భావించే వారు ముందుకొస్తే లెక్కలను సరిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు.

అందుకే కేటీఆర్ గడ్డం పెంచుతున్నారట

బీజేపీ ఎంపీ అర్వింద్ సెటైర్లు!

- గడ్డం పెంచుకుంటే ముఖ్యమంత్రి అవుతారని ఎవరో చెప్పడంతోనే కేటీఆర్ అలా చేస్తున్నారని వ్యంగ్యాస్త్రాలు
- గతంలో కేసీఆర్ పాత సచివాలయానికి వెళ్తే ఓడిపోతారని ఎవరో చెప్పడంతో కొత్త సచివాలయం నిర్మించారని వ్యాఖ్య
- కేటీఆర్ గడ్డం పెరుగుతుందేమో కానీ సీఎం మాత్రం కాలేరంటూ అర్వింద్ ఎద్దేవా
- 2028లో తెలంగాణలో కాషాయ సునామీ ఖాయమన్న అర్వింద్
- రేవంత్‌రెడ్డిపై హైకమాండ్ అసంతృప్తిగా ఉందని వ్యాఖ్య

తెలంగాణలో బీజేపీ మౌనంగా ఉందన్న ప్రచారాన్ని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ - మిగతా 2 లో

సౌదీ ఎయిర్‌పోర్ట్‌పై హౌతీల దాడి.. భారతీయుడి సహా ఇద్దరి మృతి

- సౌదీలోని దమ్మామ్ విమానాశ్రయంపై హౌతీ తిరుగుబాటుదారుల దాడి
- ఈ ఘటనలో ఒక భారతీయుడు, ఒక సౌదీ పౌరుడు మృతి
- యెమెన్‌లో కాల్పుల విరమణ ఒప్పందం విఫలమవడంతో పెరిగిన దాడులు
- సౌదీ చమురు, పౌర సదుపాయాలపై దాడులు తీవ్రతరం చేసిన హౌతీలు
- ఎర్ర సముద్రంలో ఆయిల్ షిప్‌మెంట్లను కూడా అడ్డుకుంటున్న తిరుగుబాటుదారులు

సౌదీ అరేబియాపై యెమెన్‌కు చెందిన హౌతీ తిరుగుబాటుదారులు దాడులను మరింత తీవ్రతరం చేశారు. బుధవారం రాత్రి

సూర్యుడు అంతరించిపోయాక ఏం జరుగుతుంది?

- సౌర కుటుంబంపై కొత్త అధ్యయనం
- సూర్యుడి జీవితకాలం మరో ఐదు బిలియన్ సంవత్సరాలు
- సూర్యుడు చివరి దశలో ద్రవ్యరాశిని కోల్పోతాడని అంచనా
- బాహ్య గ్రహాల కక్ష్యలు అస్థిరమయ్యే అవకాశం
- 90 శాతం సిమ్యులేషన్లలో మూడు బిలియన్ ఏళ్లలో అస్థిరత
- కొన్ని గ్రహాలు సౌర కుటుంబం నుంచి బయటికి విసిరివేయబడే ప్రమాదం

మన సౌర కుటుంబానికి కేంద్రంగా ఉన్న సూర్యుడు మరో ఐదు బిలియన్ సంవత్సరాల వరకు ప్రస్తుతంలాగే ప్రకాశించే

మరో 30 ఏళ్లు మీకు అధికారం రాదు

రాహుల్‌పై అమిత్ షా ఫైర్

- నిరసనల వేళ విదేశీ పర్యటనకు వెళ్లిన రాహుల్‌పై అమిత్ షా తీవ్ర విమర్శలు
- మరో 30 ఏళ్ల పాటు కాంగ్రెస్‌కు అధికారం దక్కదని జోస్యం
- రాహుల్ విదేశీ పర్యటనలపై బీజేపీ నేతల వరుస ఆరోపణలు
- జార్జ్ సోరోస్ నుంచి క్లాసులు తీసుకునేందుకే రాహుల్ విదేశాలకు వెళ్లారన్న సంబిత్ పాత్రా
- నిరసనలు కాదు.. గెలిచిన చోట ప్రణాళికలు చూపాలని విపక్షాలకు షా హితవు

ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ విదేశీ - మిగతా 2 లో

'నోబెల్' రాలేదని అసంతృప్తి ఇప్పుడు 'పులిట్జర్' పైన కూడా!

- తనకు పులిట్జర్ రావాల్సిందని ట్రంప్ వ్యాఖ్య
- నోబెల్ శాంతి బహుమతి కూడా రాలేదని అసంతృప్తి
- రష్యా దర్యాప్తు కథనాలు తప్పుగా ఉన్నాయని ఆరోపణ
- ట్రంప్ వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో వ్యంగ్య పోస్టులు
- 2026 పులిట్జర్ అవార్డుల్లో ట్రంప్ ప్రభుత్వంపై కథనాలకు గుర్తింపు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ - మిగతా 2 లో

సిరిసిల్ల జానపద జాతరకు కేటీఆర్‌కు ఆహ్వానం

- తెలంగాణ జానపద పరిశ్రమ ఆధ్వర్యంలో కార్యక్రమ నిర్వహణ
- రాష్ట్ర సాధనలో కళాకారుల పాత్రను కొనియాడిన కేటీఆర్
- వేడుకల విజయవంతానికి పూర్తి సహకారం అందిస్తానని హామీ
- పాల్గొననున్న 33 జిల్లాలకు చెందిన జానపద కళాకారులు

సిరిసిల్లలో త్వరలో నిర్వహించనున్న 'జానపద జాతర' కార్యక్రమానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ ను నిర్వాహకులు ఆహ్వానించారు. తెలంగాణ జానపద పరిశ్రమ ఆధ్వర్యంలో ఈ వేడుకను

పాత ఒప్పందాలను వేగవంతం చేయాలి

- సీఎం చంద్రబాబు అధ్యక్షతన 22వ SIPB సమావేశం
- గత ఒప్పందాలను ఉత్పత్తి దశకు తేవాలని సీఎం ఆదేశం
- రాష్ట్రంలో సెమీకండక్టర్ల తయారీ ఎకోసిస్టమ్‌పై దృష్టి
- 714 ఒప్పందాల్లో 519 ప్రాజెక్టులు ప్రారంభమైనట్లు వెల్లడి
- పోర్టులు, ఎయిర్‌పోర్టుల అనుసంధానంపై సీఎం దిశానిర్దేశం

రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా - మిగతా 2 లో

పశ్చిమాసియాలో శాంతి స్థాపనపై ఇరు దేశాధినేతల చర్చలు

- స్మిత్ మచ్చర్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన ప్రధాని మోదీకి నెతన్యాహు నుంచి ప్రత్యేక ఆహ్వానం
- ఇజ్రాయెల్ స్వాతంత్ర్య దినోత్సవ జ్యోతిని వెలిగించాలని పిలుపు
- భారత పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్‌తో కలిసి పాల్గొనాలని విజ్ఞప్తి
- ఉగ్రవాదంపై నేలపైనా, గగనతలంలోనూ పోరాడుతున్నామన్న నేతలు

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఇజ్రాయెల్ నుంచి ఒక అరుదైన గౌరవం లభించింది. ఇజ్రాయెల్ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహించే జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో పాల్గొనాల్సిందిగా

గడ్డం పెంచితే కేటీఆర్ సీఎం అయిపోతాడా?

- 2028లో తెలంగాణలో కాషాయ సునామీ ఖాయమన్న ఎంపీ అర్వింద్
- గడ్డం పెంచితే కేటీఆర్ ముఖ్యమంత్రి కాలేరంటూ వ్యంగ్యాస్త్రాలు
- కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య రహస్య పొత్తు చర్చలు జరుగుతున్నాయని ఆరోపణ

నిజామాబాద్ బీజేపీ ఎంపీ - మిగతా 2 లో

అందుకే కేటీఆర్ గడ్డం పెంచుతున్నారట

మొదటిపేజీ తరువాయి – తోసిపుచ్చారు. 2028 అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో కాషాయ సునామీ ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ గెలుపు కోసం తెరవెనుక పనులు జరుగుతున్నాయని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ఏ పార్టీతోనూ పొత్తు లేకుండానే విజయం సాధిస్తామని అన్నారు. గురువారం నిజామాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు పరస్పరం కాపాడుకుంటున్నారని అర్వింద్ ఆరోపించారు. రాష్ట్రంలో ఈ రెండు పార్టీల మధ్య పొత్తు చర్చలు జరుగుతున్నాయని అన్నారు. కాంగ్రెస్ హైకమాండ్ సీఎం రేవంత్‌రెడ్డిపై అసంతృప్తితో ఉందని, బీఆర్ఎస్‌తో పొత్తు ద్వారా ఆయనను పదవి నుంచి తప్పించే ఆలోచనలో ఉందని వ్యాఖ్యానించారు. కాళేశ్వరం ప్రాజెక్టు బీఆర్ఎస్ పాలనలో అవినీతికి వేదికగా మారిందని అర్వింద్ విమర్శించారు. గతంలో లక్షల కోట్లు దోచుకున్నారంటూ ఆరోపణలు ఎదుర్కొన్న బీఆర్ఎస్‌కు ప్రజలు మళ్లీ ఎందుకు ఓటేస్తారని ప్రశ్నించారు. సోషల్ మీడియాలో పెయిడ్ ప్రచారాలు చేయించుకుంటూ ఆ పార్టీ గొప్పలు చెప్పుకుంటోందని విమర్శించారు. త్వరలో పత్రికలు, టీవీ ఛానళ్లు, సోషల్ మీడియా వేదికలపై బీజేపీ మరింత దూకుడుగా వ్యవహరిస్తుందని చెప్పారు. తమ ప్రశ్నలకు బీఆర్ఎస్ సమాధానం చెప్పాల్సి వస్తుందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ కనుమరుగవుతుందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్‌ను ఎవరూ ఓడించాల్సిన అవసరం లేదని, ఆ పార్టీనే కనుమరుగవుతుందని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గడ్డం పెంచడంపైనా అర్వింద్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. గడ్డం పెంచుకుంటే ముఖ్యమంత్రి అవుతారని ఎవరో చెప్పడంతోనే కేటీఆర్ అలా చేస్తున్నారేమోనని సెటైర్ వేశారు. గతంలో కేసీఆర్ పాత సచివాలయానికి వెళ్తే ఓడిపోతారని ఎవరో చెప్పడంతో కొత్త సచివాలయం నిర్మించారని, అయినా ఎన్నికల్లో గెలవలేకపోయారని అన్నారు. ముఖ్యమంత్రి కావాలనే ఆశతో గడ్డం పెంచుకోవడం కేటీఆర్‌తోనే మొదలుకాలేదని, గతంలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కూడా గడ్డం పెంచారని గుర్తుచేశారు. ఆయన గడ్డం పెరిగిందే తప్ప కాంగ్రెస్ పార్టీ బలపడలేదని వ్యాఖ్యానించారు. కేటీఆర్ గడ్డం పెరుగుతుందేమో కానీ సీఎం మాత్రం కాలేరంటూ అర్వింద్ ఎద్దేవా చేశారు.

సాదీ ఎయిర్‌పోర్ట్‌పై హౌతీల దాడి.. భారతీయుడి సహా ఇద్దరి మృతి

మొదటిపేజీ తరువాయి – దమ్మామ్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని లక్ష్యంగా చేసుకుని జరిపిన దాడిలో ఇద్దరు వ్యక్తులు మరణించగా, మరో ఎనిమిది మంది గాయపడ్డారు. ఈ విషయాన్ని సౌదీ సివిల్ ఏవియేషన్ అథారిటీ నేడు ఒక ప్రకటనలో అధికారికంగా ధ్రువీకరించింది. మృతుల్లో ఒకరు సౌదీ పౌరుడు కాగా, మరొకరు భారతీయుడని అధికారులు తెలిపారు. దాడి కారణంగా విమానాశ్రయానికి జరిగిన నష్టాన్ని అంచనా వేస్తున్నట్లు పేర్కొన్నారు. గత కొన్ని వారాలుగా సౌదీ అరేబియాలోని చమురు క్షేత్రాలు, పౌర మౌలిక సదుపాయాలపై హౌతీల దాడులు తీవ్ర స్థాయిలో పెరిగాయి. ఈ దాడుల కారణంగా రియాద్‌లోని ప్రధాన విమానాశ్రయాన్ని మూసివేయడంతో పాటు సౌదీ ప్రభుత్వం ఓ కీలక పెట్టుబడుల సదస్సును కూడా వాయిదా వేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కేవలం ఈ నెలలోనే సౌదీ విమానాశ్రయాలపై జరిగిన వివిధ దాడుల్లో ఇప్పటివరకు మొత్తం 22 మంది మరణించినట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. మరోవైపు ఎర్ర సముద్రంలో హౌతీలు మారిటైమ్ దిగ్బంధనం విధించడం కూడా తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ప్రపంచంలోనే అతిపెద్ద ముడి చమురు ఎగుమతిదారు అయిన సౌదీ అరేబియా నుంచి వెళ్లే ఆయిల్ షిప్‌మెంట్లకు ఇది పెద్ద ముప్పుగా మారింది. యెమెన్‌లో సౌదీ నేతృత్వంలోని సంకీర్ణ దళాలు, ఇరాన్ మద్దతున్న హౌతీ తిరుగుబాటుదారుల మధ్య ఏళ్లుగా అంతర్యుద్ధం కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం గత జులైలో విఫలమైంది. అప్పటి నుంచి హౌతీలు దాడులను తీవ్రతరం చేశారు. ఒప్పందం ముగిసిన తర్వాత సౌదీ నౌకలు, భూభాగాలు, చమురు క్షేత్రాలే లక్ష్యంగా దాడులు ప్రారంభించిన హౌతీలు, సెప్టెంబర్‌లో భారీ దాడికి దిగి ఎర్ర సముద్ర తీరంలోని పలు ప్రభుత్వ ఆధీన ప్రాంతాలను స్వాధీనం చేసుకున్నారు. దీనికి ప్రతిగా హౌతీల నియంత్రణలో ఉన్న యెమెన్‌లోని పలు ప్రాంతాలపై సౌదీ వైమానిక దళం తరచూ వైమానిక దాడులు జరుపుతోంది. ఈ పరస్పర దాడులతో యెమెన్ సంక్షోభం మరింత తీవ్రమవుతోంది.

'నోబెల్' రాలేదని అసంతృప్తి.. ఇప్పుడు 'పులిట్జర్' పైన కూడా!

మొదటిపేజీ తరువాయి – ట్రంప్‌కు మరో అవార్డు కావాలట! యుద్ధాలు ఆపినందుకు నోబెల్ శాంతి బహుమతి రావాల్సిందని పదేపదే చెబుతున్న ఆయన.. ఇప్పుడు పులిట్జర్ పురస్కారంపైనా తనకు హక్కు ఉందంటున్నారు. నేను రాసిన రచనలకుగానూ ఆ అవార్డు రావాల్సిందని వ్యాఖ్యానించారు. దక్షిణ కరోలినాలో బుధవారం జరిగిన ఎన్నికల ప్రచార సభలో ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. పెండిల్టన్‌లోని టీ.ఈడీ గారిసన్ అరేనాలో జరిగిన సభలో ట్రంప్ మీడియాపై విమర్శలు గుప్పించారు. రష్యా దర్యాప్తునకు సంబంధించిన కథనాలకు పులిట్జర్ అవార్డులు అందుకున్న జర్నలిస్టులను లక్ష్యంగా చేసుకున్నారు. వారి కథనాలు తప్పుల తడకగా ఉన్నాయని ఆరోపించారు. ఆ అవార్డులు అందుకున్నవారికి అవి దక్కాల్సింది కాదని వ్యాఖ్యానించారు. తనకు నోబెల్ శాంతి బహుమతి రాలేదని, పులిట్జర్ కూడా ఇవ్వలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. తన రచనలకుగానూ తనకు పులిట్జర్ రావాల్సిందని అన్నారు. ట్రంప్ వ్యాఖ్యలపై సామాజిక మాధ్యమాల్లో పలువురు వ్యంగ్యాస్త్రాలు సంధించారు. రచనా నైపుణ్యంపై ఆయన చేసిన వాదనను ప్రశ్నించారు. ఇంగ్లిష్‌లో ఆయన మాట్లాడే తీరును ప్రస్తావిస్తూ సెటైర్లు వేశారు. పులిట్జర్ కోరుకోవడంపై కొందరు ఎగతాళి చేస్తూ పోస్టులు పెట్టారు. 2026 పులిట్జర్ పురస్కారాల్లో ట్రంప్ ప్రభుత్వం, దాని విధానాలపై వచ్చిన కథనాలకు కూడా గుర్తింపు లభించింది. ఫెడరల్ ప్రభుత్వ విభాగాల్లో మార్పులు, ఉద్యోగాల కోతల ప్రభావంపై కథనాలకుగానూ వాషింగ్టన్ పోస్ట్ అవార్డు అందుకుంది. జెఫ్రీ ఎప్‌స్టీన్ నెట్‌వర్క్‌కు సంబంధించిన న్యాయశాఖ ఫైళ్ల విడుదలకు దోహదపడిన పరిశోధనాత్మక కథనాలకు వాల్ స్ట్రీట్ జర్నల్‌కు గుర్తింపు దక్కింది. షికాగోలో ట్రంప్ ప్రభుత్వం చేపట్టిన కఠిన వలసల నిర్బంధ చర్యలపై కథనాలకు షికాగో ట్రిబ్యూన్‌కు అవార్డు దక్కింది.

గడ్డం పెంచితే కేటీఆర్ సీఎం అయిపోతాడా?

మొదటిపేజీ తరువాయి – ధర్మపురి అర్వింద్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. గడ్డం పెంచుకుంటే ముఖ్యమంత్రి అవుతారని ఎవరో చెప్పడం వల్లే కేటీఆర్ ఆ పని చేస్తున్నారని, అయితే ఆయన గడ్డం పెరుగుతుందే తప్ప సీఎం మాత్రం కాలేరని ఎద్దేవా చేశారు. 2028 ఎన్నికల్లో తెలంగాణలో కాషాయ సునామీ ఖాయమని, బీజేపీ ఒంటరిగానే అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఒకరినొకరు కాపాడుకుంటున్నాయని, ఈ రెండు పార్టీల మధ్య పొత్తు కోసం తెరవెనుక చర్చలు జరుగుతున్నాయని సంచలన ఆరోపణలు చేశారు. ఈ పొత్తుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక్కరే అడ్డంకిగా ఉన్నారని, ఆయనపై కాంగ్రెస్ అధిష్ఠానం అసంతృప్తితో ఉందని అన్నారు. బీఆర్ఎస్‌తో కుమ్మక్కై రేవంత్‌ను సీఎం పదవి నుంచి తొలగించేందుకు అధిష్ఠానం ప్రయత్నిస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో బీజేపీ సైలెంట్‌గా ఉందన్న ప్రచారాన్ని ఆయన తోసిపుచ్చారు. రాజకీయ తుపాను సృష్టించేందుకు తెరవెనుక పనులు జరుగుతున్నాయని తెలిపారు. గతంలో కాంగ్రెస్ నేత ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా గడ్డం పెంచారని, ఆయన గడ్డం పెరిగింది కానీ కాంగ్రెస్ పార్టీ ఎదగలేకపోయిందని గుర్తుచేశారు. రాష్ట్రంలో ప్రజలు కాంగ్రెస్‌కు ఓటు వేసే పరిస్థితి లేదని, వచ్చే ఎన్నికల్లో బీజేపీ ఎవరితోనూ పొత్తు పెట్టుకోకుండానే విజయం సాధిస్తుందని అర్వింద్ స్పష్టం చేశారు.

సిరిసిల్ల జానపద జాతరకు కేటీఆర్‌కు ఆహ్వానం



మొదటిపేజీ తరువాయి – సిరిసిల్ల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించనున్నారు. ఈ మేరకు తెలంగాణ జానపద పరిశ్రమ రాష్ట్ర అధ్యక్షుడు పత్తిపాటి రమణాకర్, ఇతర కార్యవర్గ సభ్యులతో కలిసి కేటీఆర్‌ను కలుసుకొని ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ కళాకారులతో ఆత్మీయంగా ముచ్చటించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను, జానపద కళలను కాపాడటంలో కళాకారులు చేస్తున్న కృషిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ముఖ్యంగా, తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ సమయంలో జానపద కళాకారులు తమ పాటలు, ప్రదర్శనలతో ప్రజల్లో చైతన్యం నింపారని, మలిదశ ఉద్యమంలో వారి పాత్ర ఎంతో కీలకమని కేటీఆర్ గుర్తుచేశారు. ఈ జానపద జాతరలో రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి కళాకారులు పాల్గొని తమ కళలను ప్రదర్శించనుండటం అభినందనీయమన్నారు. తెలంగాణ గొప్ప జానపద వారసత్వాన్ని చాటిచెప్పే ఈ వేడుకల విజయవంతానికి తన పూర్తి సహకారం అందిస్తానని ఆయన నిర్వాహకులకు హామీ ఇచ్చారు.

సూర్యుడు అంతరించిపోయాక ఏం జరుగుతుంది?



మొదటిపేజీ తరువాయి – అవకాశం ఉంది. అయితే, ఆ తర్వాత సౌర కుటుంబంలో చోటుచేసుకునే పరిణామాలు శాస్త్రవేత్తలు గతంలో అంచనా వేసిన దానికంటే వేగంగా, సంక్లిష్టంగా ఉండొచ్చని తాజా అధ్యయనం వెల్లడించింది. సూర్యుడు తన జీవిత చక్రం చివరి దశకు చేరుకున్నప్పుడు గ్రహాల కక్ష్యల్లో తీవ్ర మార్పులు సంభవించే అవకాశముందని పరిశోధకులు అంచనా వేశారు. 'ది ఆస్ట్రోఫిజికల్ జర్నల్ లెటర్స్'లో ప్రచురితమైన ఈ అధ్యయనంలో ఖగోళ శాస్త్రవేత్తలు కాన్‌స్టాంటైన్ బాటిగిన్, జిమ్ ఫుల్లర్, ఫ్రెడ్ సి.ఆడమ్స్ తదితరులు పాల్గొన్నారు. సూర్యుడు తన జీవితకాలం ముగిసే సమయంలో ద్రవ్యరాశిని ఒకే విధంగా, క్రమంగా కోల్పోకపోవచ్చని వారు పేర్కొన్నారు. అసమానమైన విరామాల్లో జరిగే ద్రవ్యరాశి నష్టం సౌర కుటుంబంలోని బాహ్య గ్రహాల కక్ష్యలను ప్రభావితం చేయవచ్చని వివరించారు. సాధారణంగా సూర్యుడిలో హైడ్రోజన్ ఇంధనం తగ్గిపోయిన తర్వాత అది విస్తరించి ఎర్రటి రాక్షస నక్షత్రంగా మారుతుంది. అనంతరం తన బయటి పొరలను కోల్పోయి తెల్ల మరుగుజ్జు నక్షత్రంగా మిగులుతుంది. ఈ పరిణామాల సమయంలో సూర్యుడి గురుత్వాకర్షణ ప్రభావం మారడంతో గ్రహాల కదలికల్లోనూ మార్పులు వచ్చే అవకాశం ఉంటుంది.

కంప్యూటర్ సిమ్యులేషన్లలో ఏం తేలింది?

బృహస్పతి, శని, యురేనస్, నెప్ట్యూన్ గ్రహాల కదలికలను పరిశోధకులు వందలాది కంప్యూటర్ సిమ్యులేషన్ల ద్వారా పరిశీలించారు. సూర్యుడు తెల్ల మరుగుజ్జు నక్షత్రంగా మారిన తర్వాతి పరిస్థితులను వీటిలో అనుకరించారు. సుమారు 90 శాతం సిమ్యులేషన్లలో, సూర్యుడు ఆ దశకు చేరుకున్న తర్వాత మూడు బిలియన్ సంవత్సరాల్లోపు సౌర కుటుంబంలోని బాహ్య గ్రహాల వ్యవస్థ అస్థిరంగా మారినట్లు గుర్తించారు. సూర్యుడు తన ద్రవ్యరాశిని కోల్పోయే సమయంలో గ్రహాల కక్ష్యలు మారవచ్చు. కొన్ని గ్రహాల కక్ష్యలు ఒకదానికొకటి దగ్గరగా రావడం, గ్రహాల స్థానాలు మారడం, చివరికి కొన్ని గ్రహాలు సౌర కుటుంబం నుంచి బయటకు విసిరివేయబడటం వంటి పరిణామాలు సంభవించవచ్చు. అయితే, ప్రతి గ్రహం ఢీకొంటుందని లేదా సౌర కుటుంబం మొత్తం నాశనమవుతుందని ఈ అధ్యయనం చెప్పడం లేదు. ఇవి కంప్యూటర్ నమూనాల్లో కనిపించిన పరిణామాలు మాత్రమే.

భూమికి ఏం జరుగుతుంది?

భూమికి ముప్పు మాత్రం ఇంకా చాలా దూరంలో ఉంది. సుమారు ఐదు బిలియన్ సంవత్సరాల తర్వాత సూర్యుడు విస్తరించే దశకు చేరుకున్నప్పుడు బుధుడు, శుక్రుడు, భూమి దాని ప్రభావానికి గురయ్యే అవకాశం ఉంది. అప్పటికంటే ముందే సూర్యుడి ప్రకాశం, వేడి పెరగడం వల్ల భూమిపై సముద్రాలు, వాతావరణం, జీవరాశి మనుగడకు అనుకూల పరిస్థితులు క్రమంగా దెబ్బతినవచ్చు. ఈ పరిశోధన వల్ల సూర్యుడు త్వరలోనే అంతరించిపోతాడని భావించాల్సిన అవసరం లేదు. నక్షత్రాలు తమ జీవిత చక్రం చివరి దశకు చేరుకున్నప్పుడు వాటి చుట్టూ తిరిగే గ్రహ వ్యవస్థలు ఎలా మారతాయో అర్థం చేసుకోవడానికి ఈ అధ్యయనం ఉపయోగపడుతుంది.

మరో 30 ఏళ్లు మీకు అధికారం రాదు

మొదటిపేజీ తరువాయి – పర్యటనలో ఉండగా, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆయనపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. మరో మూడు దశాబ్దాల పాటు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాదని జోస్యం చెప్పారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ పై ఇండియా కూటమి దేశవ్యాప్త నిరసనలు చేపట్టిన తరుణంలో రాహుల్ విదేశాల్లో ఉండటాన్ని బీజేపీ లక్ష్యంగా చేసుకుంది. ఢిల్లీలో యమునా నది ప్రక్షాళనకు సంబంధించిన రూ.8,941 కోట్ల విలువైన ప్రాజెక్టులను ప్రారంభించిన అనంతరం అమిత్ షా ప్రసంగించారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీని ఉద్దేశిస్తూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. "నేను మాట్లాడేది మీకు వినబడదని నాకు తెలుసు, మీరు ఎక్కడో విదేశాల్లో కూర్చున్నారు. ఎందుకు వెళ్లారో కూడా చెప్పరు, అది మీ వ్యక్తిగత విషయం.. కానీ ఢిల్లీకి తిరిగి వచ్చాక నా మాట వినండి, మరో 30 ఏళ్ల పాటు మీ వంతు రాదు" అని అమిత్ షా చురకలంటించారు. ప్రస్తుతం రాహుల్ గాంధీ నాలుగు రోజుల పర్యటన నిమిత్తం వియత్నాంలో ఉన్నట్లు సమాచారం. ఎన్నికల ప్రక్రియలో అవకతవకలు జరిగాయని, దీనిలో జ్ఞానేశ్ కుమార్ పాత్ర ఉందని ఆరోపిస్తూ ఇండియా కూటమి పార్టీలు ఆందోళనలు చేస్తున్న సమయంలో రాహుల్ విదేశీ పర్యటనకు వెళ్లడంపై బీజేపీ తీవ్రంగా స్పందించింది. ఢిల్లీలో నిరసనల్లో అబద్ధాలు చెప్పి అలసిపోయి, రాహుల్ విహారయాత్రకు వెళ్లారని బీజేపీ ఎద్దేవా చేసింది. ఆయన వియత్నాం విమానంలో ఉన్నట్లుగా చెబుతున్న ఒక వీడియోను 'ఎక్స్'లో షేర్ చేస్తూ.. "రాహుల్ గాంధీ విదేశీ పర్యటనల వెనుక ఉన్న అజెండా ఏమిటి?" అని ప్రశ్నించింది. ఇదే అంశంపై బీజేపీ నేత సంబిత్ పాత్రా మాట్లాడుతూ.. పాలన మార్పునకు కుట్ర పన్నుతున్నారని, జార్జ్ సోరోస్ నుంచి క్లాసులు తీసుకోవడానికే రాహుల్ విదేశాలకు వెళ్లారని ఆరోపించారు. కాంగ్రెస్ నేత విరామం కోసం విదేశాలకు వెళుతున్నారా? లేక తన అరాచక సహాయకారులను కలవడానికి వెళుతున్నారా? అని మరో బీజేపీ నేత ప్రదీప్ భండారీ ప్రశ్నించారు. ఈ సందర్భంగా విపక్షాల ఓట్ల దొంగతనం ఆరోపణలను కూడా అమిత్ షా తిప్పికొట్టారు. చాలా రాష్ట్రాల్లో దశాబ్దాలుగా ప్రతిపక్షాలు అధికారంలో లేకుండా పోయాయని గుర్తుచేశారు. "నిరసనలు, ప్రదర్శనలతో ఏమీ సాధించలేరు. మీరు ఎక్కడైతే ఎన్నికయ్యారో అక్కడ ప్రజల కోసం ప్రణాళికలు తీసుకురండి" అని విపక్షాలకు హితవు పలికారు.

బీసీ కులగణనలో తప్పులుంటే సరిచేస్తాం సీఎం రేవంత్ కీలక ప్రకటన

మొదటిపేజీ తరువాయి – అవసరమైతే బీసీ జనాభా లెక్కలను సవరించి, జాబితాలోకి రాని వారిని చేర్చుతామని స్పష్టం చేశారు. బీసీ వర్గాలకు సామాజిక న్యాయం చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకల్లో సీఎం పాల్గొని మాట్లాడారు. వందేళ్లలో ఎవరూ చేయని సాహసం తమ ప్రభుత్వం చేసిందని, ఏడాదిలోనే కులగణన పూర్తి చేసి తొలిసారిగా బీసీల జనాభా లెక్కలను తేల్చామని అన్నారు. ఏ కులం వారైనా తమ జనాభా తక్కువగా నమోదైందని భావిస్తే సంబంధిత వివరాలు అందించాలని సూచించారు. వచ్చే కేబినెట్ సమావేశంలో ఈ అంశంపై చర్చించి లెక్కలను మరింత పక్కాగా చేస్తామని వెల్లడించారు. తనకు అవకాశం ఉంటే తన కుర్చీ చుట్టూ బలహీనవర్గాలను కూర్చోబెట్టుకోవాలన్నదే తన ఆలోచన అని రేవంత్ రెడ్డి అన్నారు. ముదిరాజ్‌లను ప్రస్తుతం బీసీ-డీ జాబితా నుంచి బీసీ-ఏలోకి మార్చాలన్న డిమాండ్‌పైనా సీఎం స్పందించారు. ఈ అంశంపై ముదిరాజ్ నాయకులు న్యాయ నిపుణులను సంప్రదించి, ఉన్న అవకాశాలను పరిశీలించాలని సూచించారు. గంగపుత్రుల్లో ఉన్న అపోహలను కూడా తెలుసుకోవాలని అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముదిరాజ్ సామాజికవర్గానికి చెందిన పలువురికి పదవులు కల్పించామని, మిగిలిన నాయకులకు కూడా త్వరలో అవకాశాలు వస్తాయని హామీ ఇచ్చారు. తన పనితీరుపై మాట్లాడుతూ పరోక్షంగా గత సీఎం కేసీఆర్‌ను ఉద్దేశించి విమర్శలు చేశారు. తనకు ఇంకా వయసు, ఓపిక ఉన్నాయని, తాను ఫామ్‌హౌస్‌లో పడుకునే రకాన్ని కాదని వ్యాఖ్యానించారు. పండుగ సాయన్న జయంతి, వర్ధంతి వేడుకలను అధికారికంగా నిర్వహిస్తామని సీఎం ప్రకటించారు. పండుగ సాయన్న కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. దొడ్డి కొమురయ్య, పండుగ సాయన్న విగ్రహాలను ట్యాంక్‌బండ్ సమీపంలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. బలహీనవర్గాలకు సామాజిక న్యాయం, సమాన అవకాశాలు కల్పించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

తెలంగాణపై ఎల్‌నినో ఎఫెక్ట్.. పొదుపు బాటలో ప్రభుత్వం!

మొదటిపేజీ తరువాయి – పాటు ప్రత్యామ్నాయ ప్రణాళికలను సమర్థవంతంగా అమలు చేసేందుకు సిద్ధమైంది. ఇందులో భాగంగా ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యుత్ వాడకాన్ని తగ్గించాలని ఆదేశాలు జారీ చేసింది. సోమవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఈ మేరకు ఉన్నతాధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు. పగటి వేళల్లో అత్యవసరమైతే తప్ప ఎయిర్ కండిషనర్లను (ఏసీ) వినియోగించవద్దని, వాటిని కూడా 25 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత వద్దే నిర్వహించాలని స్పష్టం చేశారు. సాయంత్రం 6 గంటల తర్వాత ఏసీల వినియోగాన్ని గణనీయంగా తగ్గించాలని ఆదేశించారు. రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి ఆశాజనకంగా లేనప్పటికీ, వ్యవసాయ, గృహ అవసరాలకు నిరంతరాయంగా సరఫరా అందిస్తున్నామని తెలిపారు. పరిశ్రమలకు ఎలాంటి విద్యుత్ కోతలు విధించడం లేదని, పారిశ్రామిక యాజమాన్యాలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. అన్ని థర్మల్ పవర్ స్టేషన్లలో విద్యుత్ ఉత్పత్తిని గరిష్ఠ స్థాయికి పెంచేందుకు చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో తలెత్తే తాగునీరు, విద్యుత్ కొరతను నివారించేందుకు క్షేత్రస్థాయిలో పటిష్టమైన కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని సంజయ్ జాజు సూచించారు. ఈ అంశంపై త్వరలోనే అఖిలపక్ష సమావేశం, కేబినెట్ సబ్-కమిటీ భేటీ నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు.

నీటి కష్టాలు.. అక్రమ మోటార్లపై ఉక్కుపాదం

స్థానిక నీటి వనరుల నుంచి వ్యవసాయానికి అక్రమంగా మోటార్లు బిగించి నీటిని తోడేస్తుండటంతో, విద్యుత్ లోడ్ పెరిగి ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయని ఇంధన శాఖ అధికారులు సమావేశంలో వివరించారు. మంజీరా, సింగూరు రిజర్వాయర్ల నుంచి నీటి లభ్యత లేకపోవడంతో, అక్కడి నుంచి అందాల్సిన 110 మిలియన్ గ్యాలన్ల నీటిని మిషన్ భగీరథ (60 వీ+ణ), కృష్ణా నది వంటి ప్రత్యామ్నాయ వనరుల ద్వారా సర్దుబాటు చేస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లో తాగునీటి అవసరాలకు తప్ప నిర్మాణాలకు, ఇతర పనులకు కొత్త బోర్ల తవ్వకానికి అనుమతులు మంజూరు చేయవద్దని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ స్పష్టం చేశారు. నగరంలో మున్సిపల్ నల్లా కనెక్షన్లకు అక్రమంగా మోటార్లు బిగించి నీటిని తోడ్చుతున్న వారిపై 'హైడ్రా' సహకారంతో ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నవంబర్ 1 నుంచి నిర్మాణాలకు గ్రీన్ ట్యాంకర్ల ద్వారా శుద్ధి చేసిన నీటిని (ఎస్‌టీపీ వాటర్) సరఫరా చేయనున్నట్లు ప్రకటించారు. రంగారెడ్డి జిల్లాలో భూగర్భ జలాలు గణనీయంగా తగ్గుతున్నాయని, తాగునీటి కొరత రాకుండా ప్రత్యామ్నాయ ప్రణాళికలు అమలు చేస్తున్నామని మరో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ తెలిపారు.

పాత ఒప్పందాలను వేగవంతం చేయాలి

మొదటిపేజీ తరువాయి – ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన గురువారం రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (రాశాదీ) 22వ సమావేశం జరిగింది. గతంలో కుదిరిన ఒప్పందాలను కేవలం కాగితాలకే పరిమితం చేయకుండా, వాటిని పెట్టుబడులుగా మార్చి ఉత్పత్తి ప్రారంభించడంపై దృష్టి సారించాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ సమావేశానికి మంత్రులు నారా లోకేశ్, టీజీ భరత్, అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, పీ నారాయణ, కందుల దుర్గేశ్ వర్చువల్ పద్ధతిలో హాజరయ్యారు. పరిశ్రమలు, ఇంధనం, పర్యాటకం, ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి కీలక రంగాల్లో వచ్చిన పెట్టుబడి ప్రతిపాదనలపై బోర్డు చర్చించింది. గత ప్రభుత్వ హయాంలో కుదుర్చుకున్న 714 ఒప్పందాలకు గాను, 519 ప్రాజెక్టులకు సంబంధించి కార్యాచరణ మొదలైందని అధికారులు సీఎంకు వివరించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌లో సెమీకండక్టర్ల తయారీకి అవసరమైన ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేయాలని సూచించారు. దీంతో పాటు పోర్టులు, విమానాశ్రయాలు, రోడ్లు, రైల్వే కనెక్టివిటీని మెరుగుపరచడం ద్వారా రాష్ట్రంలోని తూర్పు, పశ్చిమ ప్రాంతాలను అనుసంధానించాలని దిశానిర్దేశం చేశారు. కొత్త పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు, ఉన్న ప్రాజెక్టులను వేగవంతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేయాలని స్పష్టం చేశారు.

స్మిత్ మచ్చర్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన



మొదటిపేజీ తరువాయి – ఆ దేశ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు స్వయంగా మోదీని ఆహ్వానించారు. భారత పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్‌తో కలిసి ఈ జ్యోతిని వెలిగించాలని కోరడం ఈ ఆహ్వానంలోని విశేషం. గురువారం ఇరువురు నేతలు టెలిఫోన్ ద్వారా సంభాషించారు. ఈ సందర్భంగా నెతన్యాహు చేసిన ప్రతిపాదనకు ప్రధాని మోదీ ధన్యవాదాలు తెలియజేశారు. భారత్, ఇజ్రాయెల్ దేశాలు ఉగ్రవాదంపై పోరాడుతున్నాయని మోదీ వ్యాఖ్యానించినట్లు ప్రధానమంత్రి కార్యాలయం వెల్లడించింది. గత సెప్టెంబర్‌లో దుబాయ్ నుంచి టెల్ అవీవ్ వెళుతున్న 'ఫ్లైదుబాయ్' విమానంలో తన సహ పైలట్ జరిపిన దాడిని భారత పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్ వీరోచితంగా అడ్డుకున్నారు. తీవ్రంగా గాయపడినప్పటికీ, ఆయన అత్యంత చాకచక్యంగా వ్యవహరించి, దాడి చేసిన వ్యక్తిని సిబ్బందికి అప్పగించడమే కాకుండా విమానాన్ని సురక్షితంగా ల్యాండ్ చేశారు. "ఇజ్రాయెల్, భారత్ సహా యావత్ ప్రపంచానికే ఆయన ఒక హీరో" అని నెతన్యాహు కొనియాడారు. ఆయన సాహసాన్ని గౌరవిస్తూ ఈ ఆహ్వానం పంపినట్లు పేర్కొన్నారు. ఈ సంభాషణలో భాగంగా ఇరు దేశాల మధ్య ఉన్న వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలని ఇరువురు నేతలు పునరుద్ఘాటించారు. పశ్చిమాసియాలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులు, అక్కడ శాంతి, స్థిరత్వం నెలకొల్పాల్సిన ఆవశ్యకతపై చర్చించారు. చర్చలు, దౌత్య మార్గాల ద్వారానే ఏ సమస్యకైనా పరిష్కారం లభిస్తుందని ప్రధాని మోదీ ఈ సందర్భంగా నొక్కిచెప్పారు.

హైదరాబాద్ బ్యూరో నిలువుటద్దం; తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణంపై మహారాష్ట్ర ప్రభుత్వంతో త్వరలో జరగనున్న చర్చలకు పూర్తి వివరాలతో సిద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బ్యారేజీని 152 మీటర్ల ఎత్తులో నిర్మించేందుకు మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించేలా సాంకేతిక నివేదికలు, నీటి లభ్యత, ముంపు విస్తీర్ణానికి సంబంధించిన వివరాలను సిద్ధం చేయాలని సూచించారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు, ఎంపీ వేం నరేందర్‌రెడ్డితో కలిసి నీటిపారుదల ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీతో పాటు డిండి, అచ్చంపేట ఎత్తిపోతల పథకాలపై చర్చించారు.

152 మీటర్ల ఎత్తుపై దృష్టి

తుమ్మిడిహెట్టి వద్ద 152 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మిస్తే సుమారు 2,300 ఎకరాలు, 150 మీటర్ల ఎత్తులో నిర్మిస్తే వెయ్యి ఎకరాల్లోపు భూములు ముంపునకు గురయ్యే అవకాశం ఉందని అధికారులు వివరించారు. మహారాష్ట్ర పరిధిలో గ్రామాలు ముంపునకు గురయ్యే ప్రమాదం లేదని తెలిపారు. సాధ్యమైనంత ఎక్కువ నీటిని వినియోగించుకునేలా, ముంపు ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకొని నిర్మాణ ఎత్తుపై నిర్ణయం తీసుకోవాలని సీఎం సూచించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని అటవీ, గిరిజన ప్రాంతాలకు చెందిన సుమారు రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు లక్ష్యమని సీఎం పేర్కొన్నారు. గతంలో 148 మీటర్ల ఎత్తుకు మహారాష్ట్ర అంగీకరించినప్పటికీ, ఆ ఎత్తుతో ఆశించిన స్థాయిలో నీటిని తీసుకురావడం సాధ్యం కాదని అభిప్రాయపడ్డారు. బ్యారేజీ ఎత్తుపై స్పష్టత వచ్చిన అనంతరం తుమ్మిడిహెట్టి నుంచి ఎల్లంపల్లి వరకు నీటి తరలింపు మార్గం, రూపకల్పన, భూసేకరణపై దృష్టి పెట్టాలని ఆదేశించారు.

డిండి, అచ్చంపేటకు అదనపు నీరు

డిండి ప్రాజెక్టుకు ఏదుల రిజర్వాయర్ నుంచి 0.5 టీఎంసీలు, అచ్చంపేట ఎత్తిపోతల పథకానికి 0.1 టీఎంసీ నీటిని అందించే ఏర్పాట్లు చేయాలని సీఎం సూచించారు. ఈ రెండు ప్రాజెక్టులకు అవసరమైన 0.6 టీఎంసీల నీటిని శ్రీశైలం నుంచి అదనంగా సమకూర్చుకునే అవకాశాలను పరిశీలించాలని ఆదేశించారు. నార్లాపూర్ నుంచి ఏదుల రిజర్వాయర్ వరకు నీటిని తరలించేందుకు అవసరమైన పంపులు, పంప్‌హౌస్‌లు, కాల్వలు, సొరంగాల సామర్థ్యంపై అధ్యయనం చేసి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. పాలమూరు ప్రాజెక్టు నీటి అవసరాలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా డిండి, అచ్చంపేటకు నీటిని అందించాలని స్పష్టం చేశారు. నార్లాపూర్ నుంచి నీటిని తరలించడం, ఏదుల నుంచి సరఫరా చేయడం వల్ల అయ్యే వ్యయాలు, సాధ్యాసాధ్యాలను అధికారులు వివరించారు. పాలమూరు ప్రాజెక్టు నీటి కేటాయింపులకు ఆటంకం లేకుండా అదనపు నీటి సరఫరా వ్యవస్థను అభివృద్ధి చేయాలన్న సీఎం సూచనకు మంత్రులు మద్దతు తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

ప్రమాద ప్రాంతాల్లో భద్రతా ప్రమాణాలను మెరుగుపరచాలి.

రహదారి భద్రతపై కలెక్టర్, ఎస్పీ ప్రత్యేక దృష్టి

జీరో ఫటాలిటీ డిస్ట్రిక్ట్ - జి ఎఫ్ డి కార్యక్రమంలో కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ పరితోష్ పంకజ్ సంయుక్త పరిశీలన.

సంగారెడ్డి, అక్టోబర్ 23 నిలువుటద్దం ప్రతినిధి: జిల్లాలో రోడ్డు ప్రమాదాలు, ప్రమాద మరణాలను తగ్గించేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలు, సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా రహదారి భద్రతా ప్రమాణాలను మెరుగుపరచాలని సూచించారు. ప్రమాద రహిత (జీరో ఫటాలిటీ డిస్ట్రిక్ట్ - జి ఎఫ్ డి) కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జాతీయ రహదారి 65పై పటాన్‌చెరు నుంచి దిగ్వాల్ కూడలి వరకు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ పరితోష్ పంకజ్ , అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, అదనపు కలెక్టర్ పాండు, జాతీయ రహదారులు, రహదారులు--భవనాలు, పోలీసు, రవాణా శాఖల అధికారులతో కలిసి పటాన్‌చెరు నుంచి జహీరాబాద్ మార్గంలో ప్రమాదాలు అధికంగా జరిగే ప్రమాద స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాల్లో రహదారి భద్రతా ప్రమాణాలను మెరుగుపరిచి, ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలను ప్రాధాన్యత క్రమంలో చేపట్టాలని సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో ఎత్తైన విద్యుద్దీపాలు, హెచ్చరిక సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. పటాన్చెరువు బస్టాప్ ప్రాంతంలో పాదచారుల వంతెన ఏర్పాటు చేయాలని, కంది చౌరస్తా వద్ద రహదారి అంచులను సూచించే గుర్తులు ఏర్పాటు చేసి, రహదారి స్పష్టంగా కనిపించేలా విద్యుద్దీపాల సదుపాయం కల్పించాలని సూచించారు. పోతిరెడ్డి పల్లి చౌరస్తా వద్ద రాకపోకల రద్దీని తగ్గించడంతో పాటు, బస్సుల నుంచి దిగే ప్రయాణికులు సురక్షితంగా రాకపోకలు సాగించేలా తగిన ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. రహదారిపై వాహనాల వేగాన్ని తగ్గించే రంబుల్ స్ట్రిక్స్ ,స్పీడ్ బ్రేక్స్ ,వాహనాల వేగాన్ని గుర్తించే పరికరాలను ఏర్పాటు చేయడంతో పాటు, ప్రమాదకర మలుపులు, ఇరుకైన రహదారుల వద్ద ముందస్తు హెచ్చరికలు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రహదారి పై వాహనాల అధిక వేగాన్ని నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రమాద రహిత జిల్లా లక్ష్యంగా సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్, సూచించారు. రాకపోకల నియంత్రణ, వాహనదారుల్లో రహదారి భద్రతపై అవగాహన పెంపు, అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. గుర్తించిన లోపాలను త్వరితగతిన పరిష్కరించి, చేపట్టిన చర్యలపై సమగ్ర నివేదికలు సమర్పించాలని బాధ్యతాయుత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి లలితా దేవి, రహదారులు--భవనాల శాఖ కార్యనిర్వాహక ఇంజినీరు శ్రీనివాస్, ఉప కార్యనిర్వాహక ఇంజినీరు రవీందర్, డి టి ఓ వాసు, ఏ ఎమ్ వి ఐ గౌతమ్, సంగారెడ్డి, పటాన్‌చెరు ఉప పోలీసు అధికారుల బృందాల అధికారులు, జాతీయ రహదారుల ఇంజినీరింగ్ అధికారులు, సంబంధిత జిల్లా యంత్రాంగం, పోలీసు శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌కు బీఆర్ఎస్ శ్రేణుల దసరా శుభాకాంక్షలు

సంగారెడ్డి నిలువుటద్దం ప్రతినిధి,అక్టోబర్ 23: విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌ను బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జమ్మి ఆకులు అందించి దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆప్యాయంగా ముచ్చటించారు. విజయదశమి ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అభివృద్ధిని తీసుకురావాలని నాయకులు ఆకాంక్షించారు. పండుగలు ప్రజల మధ్య ఐక్యత, సోదరభావాన్ని పెంపొందిస్తూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అట్నగారి మల్లేష్, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

బిగ్ టీవీ ప్రసాద్ కుమార్తెల వేడుకల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపిన బండి రమేష్, ఎమ్మెల్యే గాంధీ



కూకట్‌పల్లి ప్రతినిధి, నిలువుటద్దం ప్రతినిధి,అక్టోబర్ 23: శుక్రవారం కూకట్‌పల్లిలోని ఇతిహాస్ రెస్టారెంట్ -- వేద ఫంక్షన్ హాల్‌లో మీడియా మిత్రుడు బిగ్ టీవీ ప్రసాద్ ఇద్దరు కుమార్తెల వేడుకలు ఘనంగా నిర్వహించారు. పెద్ద కుమార్తె లంగా వోణీ ఫంక్షన్, రెండవ కుమార్తె మొదటి పుట్టినరోజు వేడుకలను కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ఈ వేడుకలకు టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ మరియు కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ తో పాటు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ హాజరై చిన్నారులను ఆశీర్వదించారు. బిగ్ టీవీ ప్రసాద్ కి, వారి కుటుంబ సభ్యులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ, చిన్నారులు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఎదగాలని, వారి జీవితాలు ఆనందంతో నిండాలని ఆకాంక్షించారు. ప్రసాద్ కుటుంబంలో ఎల్లప్పుడూ సంతోషాలు వెల్లివిరియాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో మీడియా మిత్రుడు హరి, బాలాజీనగర్ డివిజన్ అధ్యక్షుడు రాజేష్ కుమార్ గౌడ్, కేపీహెచ్‌బీ డివిజన్ అధ్యక్షుడు అరవింద్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు రమణ, రవి, కళ్యాణ్, వాసు, పిడికిడి గోపాల్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతమే లక్ష్యం.. కార్యకర్తలే నా బలం

కూకట్‌పల్లి, నిలువుటద్దం ప్రతినిధి: తనపై విధించిన సస్పెన్షన్‌ను టీపీసీసీ క్రమశిక్షణ చర్యల కమిటీ ఎత్తివేయడంపై కూకట్‌పల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. తన వివరణను పరిశీలించి నిర్ణయం తీసుకున్న టీపీసీసీ నాయకత్వానికి, క్రమశిక్షణ చర్యల కమిటీ చైర్మన్, ఎంపీ డాక్టర్ మల్లు రవికి, వైస్ చైర్మన్ శ్యామ్ మోహన్ అనంతులకు, డీసీసీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాల పట్ల తనకు పూర్తి నిబద్ధత ఉందని, ఎన్ని ఆటంకాలు ఎదురైనా పార్టీని వీడకుండా కొనసాగుతానని స్పష్టం చేశారు. పదవుల కంటే పార్టీ బలోపేతమే తన లక్ష్యమని, కార్యకర్తల అభిమానం తన బలమని పేర్కొన్నారు. స్థానిక నాయకత్వం, జిల్లా కాంగ్రెస్ కమిటీతో సమన్వయంగా పనిచేస్తూ రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేస్తానని వెల్లడించారు.

నేతాజీ నగర్‌లో వైభవంగా రేణుక ఎల్లమ్మ, నల్ల పోచమ్మ ఆలయ వార్షికోత్సవం

జగదీశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అన్నదానం

నేతాజీ నగర్, నిలువుటద్దం: కాలనీలోని శ్రీశ్రీశ్రీ భగవతి రేణుక ఎల్లమ్మ, నల్ల పోచమ్మ ఆలయ ప్రతిష్ఠాపన పదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆలయ ధర్మకర్త జగదీశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు బేరి రామచందర్ యాదవ్ మాట్లాడుతూ అమ్మవారి కరుణాకటాక్షాలతో ప్రజలంతా ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో ఉండాలని, సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జగదీశ్వర్ గౌడ్‌ను ఘనంగా సన్మానించారు. ఆయన రాజకీయంగా మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని పలువురు ఆకాంక్షించారు. బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి మారబోయిన రవికుమార్ యాదవ్, తాజా మాజీ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రాగం హరిశంకర్ యాదవ్, శేఖర్ సాగర్, పులిపాటి శ్రీనివాస్, జోషి రాఘవేంద్ర శర్మ, యోగా గురువు వెంకటేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు. కాలనీ ఉపాధ్యక్షులు, పెద్దలు, మహిళలు, యువజన నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అన్ని వర్గాలను కలుపుకుపోతేనే సమగ్ర అభివృద్ధి

గౌడ సంక్షేమ సంఘం నాయకులకు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ సూచన

కుత్బుల్లాపూర్, నిలువుటద్దం ప్రతినిధి: సమాజంలోని అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని సమగ్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ గౌడ్ పిలుపునిచ్చారు. తెలంగాణ గౌడ సంక్షేమ సంఘం నాయకులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర అధ్యక్షుడు ముండాల మల్లేష్ గౌడ్ మార్గదర్శకత్వంలో, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు పరుచూరి సురేష్ గౌడ్, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా మహిళా అధ్యక్షురాలు బెల్లంకొండ జ్యోతి గౌడ్ ఆధ్వర్యంలో నాయకులు ఎమ్మెల్యేతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వివేకానంద్ గౌడ్ మాట్లాడుతూ నాయకులు తమ సామాజిక వర్గానికే పరిమితం కాకుండా అన్ని వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ముందుకు సాగాలని సూచించారు. సమాజంలోని ప్రతి ఒక్కరి అభ్యున్నతికి కృషి చేసినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చెలిమిన స్వప్న గౌడ్, ఉప్పాల సాయికుమార్ గౌడ్, బెల్లంకొండ యాకయ్య గౌడ్, నరసింహ గౌడ్, మహేష్ గౌడ్, మాధవి గౌడ్, నేరెళ్ల కుమార్, ఇరువురి రాఘవేంద్ర గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకాశ్ నగర్‌లో సమస్యలపై ఎమ్మెల్యే మాధవరం ఆగ్రహం

డ్రైనేజీ, రోడ్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలి.. అధికారులకు ఆదేశాలు

కూకట్‌పల్లి, నిలువుటద్దం ప్రతినిధి: బేగంపేట డివిజన్ పరిధిలోని ప్రకాశ్ నగర్‌లో డ్రైనేజీ, రహదారుల సమస్యలపై కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం కాలనీలో పర్యటించిన ఆయనకు ఎస్సీబీసీ కమిటీ హాల్ వద్ద నెలకొన్న డ్రైనేజీ సమస్యను స్థానికులు వివరించారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సమస్యను తక్షణమే పరిష్కరించాలని, రహదారుల అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. నిధుల కొరత ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిధుల కొరత లేకుండా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని పేర్కొన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి పనుల పరిస్థితిపై విమర్శలు చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా మౌలిక సదుపాయాల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్పష్టం చేశారు.



అమెరికాలో హిస్టారికల్ వరల్డ్ ప్రీమియర్

దేశమంతా ఎదురు చూస్తున్న పాన్ ఇండియా పౌరాణిక దృశ్యకావ్యం 'రామాయణ'. నితీశ్ తివారీ రూపొందిస్తున్న ఈ వెండితెర ఇతిహాసంలో సీతారాములుగా సాయిపల్లవి, రణబీర్‌కపూర్ నటిస్తున్న విషయం తెలిసిందే. దాదాపుగా మూడువేల కోట్ల నిర్మాణ వ్యయంతో రెండు భాగాలుగా నమిత్ మల్హోత్రా నిర్మిస్తున్న ఈ ఫ్రాంచైజీలోని తొలి భాగం దీపావళి కానుకగా నవంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా హిందీ, తెలుగు, కన్నడ, తమిళం, మలయాళ భాషల్లో విడుదల కానున్నది. ఈ నేపథ్యంలో మేకర్స్ వరల్డ్ ప్రీమియర్‌కు సిద్ధమవుతున్నారు. ఈ నెల 27న సాయంత్రం అమెరికా లాస్ ఏంజెల్స్‌లోని అకాడమీ మ్యూజియం ఆఫ్ మోషన్ పిక్చర్స్‌లో ఉన్న డేవిడ్ గెఫెన్ థియేటర్‌లో ఈ సినిమా వరల్డ్ ప్రీమియర్ జరుగనున్నది. ఆహ్వానం ఉన్నవారికి మాత్రమే ప్రవేశం కల్పించే ఈ ప్రీమియర్‌కు హాలీవుడ్ ప్రముఖుల, దర్శకులు, అంతర్జాతీయ మీడియా ప్రతినిధులు, పలువురు ప్రపంచ సినీ ప్రముఖులు హాజరుకానున్నారు. ఎన్నో అంతర్జాతీయ కార్యక్రమాలకు, ఆస్కార్ వేడుకలకు వేదికగా నిలిచిన అకాడమీ మ్యూజియంలో 'రామాయణ' ప్రీమియర్ జరుగనుండటం భారతీయ సినీచరిత్రలోనే సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ ఘట్టమని మేకర్స్ చెబుతున్నారు. 945మంది ప్రేక్షకులు కూర్చునే సామర్థ్యం ఉన్న ఈ థియేటర్‌లో 3డీ ఫార్మాట్‌లో ఈ సినిమా స్క్రీనింగ్ జరుగనున్నది. ఇక ఈ ఫ్రాంచైజీకి చెందిన రెండో భాగం వచ్చే ఏడాది దీపావళికి రానున్న విషయం తెలిసిందే.

రివార్డులతోపాటు అవార్డులూ సాధించే సినిమా

నరేష్ వీకే, అనుపమ పరమేశ్వరన్, శరణ్యప్రదీప్, అఖిల్ ఉడ్డెమారి ప్రధాన పాత్రధారులుగా రూపొందిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'క్రైమ్ కల్యాణం'. ఇద్దరు గాలాల దర్శకుడు. జీవన్ జగన్మోహన్‌రెడ్డి నిర్మాత. ఇటీవలే విడుదలైన ఈ సినిమా థియేటర్లలో ప్రదర్శితమవుతున్నది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో ఈ సినిమా సక్సెస్‌మీట్‌ని నిర్వహించారు. చిత్ర కథానాయిక అనుపమ పరమేశ్వరన్ మాట్లాడుతూ 'ఆడియన్స్ రెస్పాన్స్ అద్భుతంగా ఉంది. గట్స్, ప్యాషన్ ఉన్న ఇలాంటి టీమ్ ఉంటేనే, ఈ తరహా విజయాలు సాధ్యమవుతాయి. నేను కమర్షియల్ సినిమాలతోపాటు కంటెంట్ ఓరియంటెడ్ సినిమాలు కూడా చేస్తుండటం వల్ల ప్రేక్షకులకు వినోదంతో పాటు మంచి సందేశం కూడా ఇవ్వగలుగుతున్నా. వినోదం, సందేశం రెండూ ఉన్న సినిమా 'క్రైంకల్యాణం'' అని పేర్కొన్నారు. దసరా పండక్కి రక్తపాతాలతో కూడిన సినిమాలతోపాటు రక్తసంబంధాల కథల్ని కూడా చూస్తారని ప్రేక్షకులు రుజువు చేశారు. భావోద్వేగాలతో ప్రతి తెలుగువాడికి కలిపే సినిమా ఇదని, రివార్డులతోపాటు ఈ సినిమా అవార్డులను కూడా సాధిస్తుందని ఆగ్రనటుడు నరేశ్ వీకే నమ్మకం వెలిబుచ్చారు. ఇంకా చిత్రబృందమంతా మాట్లాడారు.

హానెస్ట్‌గా తీసిన గ్లోబల్ సినిమా 'కల్ట్'

'మొదటి అయిదు నిమిషాలకే ప్రేక్షకులను కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లే సినిమా ఇది. ఇదో గ్లోబల్ కంటెంట్. అందుకే ఈ సినిమాను జపనీస్,స్పానిష్ భాషల్లో కూడా డబ్ చేశాం. ఇది భాషను దాటి వెళ్లే సినిమా. రెండు గంటల 20 నిమిషాల పాటు ఇంటెన్స్ డ్రామా ఉంటుంది. యాక్షన్ కంటే ఆడియన్స్ డ్రామాకు కనెక్ట్ అవుతారు. నేను ఎక్స్‌పెరిమెంట్ చేసిన ప్రతిసారి ఆడియన్స్ కనెక్ట్ అయ్యారు. ఇందులో ఎలాంటి ఈక్వేషన్స్, క్యాలిక్యులేషన్స్ ఉండవు. చాలా హానెస్ట్‌గా ఈసినిమా చేశాం. ఇందులో 150మంది ప్రొఫెషనల్ యాక్టర్స్ ఉన్నారు. వారంతా కేవలం నా కోసం ఈ సినిమాలో భాగమయ్యారు. నటుడిగానే కాక, దర్శకుడిగా కూడా నాకు సంతృప్తిని ఇచ్చిన సినిమా 'కల్ట్' అని విశ్వక్‌సేన్ అన్నారు. ఆయన నటిస్తూ స్వీయ దర్శకత్వం వహించిన సినిమా 'కల్ట్'. సందీప్ కాకర్ల నిర్మాత. ఈ నెల 30న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో విశ్వక్‌సేన్ మాట్లాడారు. ఇంకా నిర్మాత సందీప్ కాకర్ల, యాక్టర్ ఈటీ, అనిరుధ్, కార్తికేయ, తారక్ పొన్నప్ప కూడా మాట్లాడారు. గోవాలోని ఒక నిర్మానుష్య ఐలాండ్ ఎస్టేట్‌లో 300మందికి పైగా చిక్కుకుపోవడంతో ట్రైలర్ మొదలైంది. ఆద్యంతం ఉత్కంఠభరితంగా ట్రైలర్ సాగింది. ట్రైలర్‌లో విశ్వక్ పాత్ర విభిన్న కోణాల్లో కనిపించింది. వాస్తవంగా జరిగిన భయానక సంఘటనల స్ఫూర్తితో రూపొందిన నాటి ఇండియన్ ఎపిక్ థ్రిల్లర్ ఇదని మేకర్స్ చెబుతున్నారు.

షూటింగ్ పూర్తి

మెగా హీరో సాయిదుర్గతేజ్ నటిస్తున్న యాక్షన్ అడ్వెంచర్ 'సంబరాల ఏటి గట్టు' రోహిత్ కేపీ దర్శకత్వంలో ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై కె.నిరంజన్‌రెడ్డి, చైతన్యరెడ్డి నిర్మిస్తున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రం షూటింగ్ విజయవంతంగా పూర్తయింది. ఈ విషయాన్ని తెలియజేస్తూ ఆదివారం మేకర్స్ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా విడుదల చేసిన 'బిహైండ్ ది సీన్స్' వీడియోలో ఈ సినిమా కోసం వేసిన భారీ సెట్స్‌ని, కొన్ని రా యాక్షన్ సన్నివేశాలతోపాటు టీమ్ మధ్య ఉన్న ఎమోషనల్ బాండింగ్‌ని కూడా చూపించారు. వందకి పైగా భారీ షెడ్యూల్స్‌తో 160 రోజులకు పైగా షూటింగ్ జరిపామని, సాయిదుర్గతేజ్ కెరీర్‌లోనే బిగ్గెస్ట్ మూవీగా 'సంబరాల ఏటిగట్టు' నిలుస్తుందని మేకర్స్ తెలిపారు. షూటింగ్ పూర్తయిన సందర్భంగా యూనిట్ మొత్తానికి కృతజ్ఞతలు తెలుపుతూ, టీమ్‌తో కలిసి హీరో సాయిదుర్గతేజ్ సంబరాల్లో పాల్గొన్నారు. సంక్రాంతి కానుకగా జనవరి 12న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ చిత్రంలో కన్నడ నటుడు ధనంజయ, ఐశ్వర్యలక్ష్మి, జగపతిబాబు, నరేష్ వీకే, సాయికుమార్, శ్రీకాంత్ మేక, అనన్య నాగళ్ల ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: వెట్రి పళనిసామి, సంగీతం: బి.అజనీష్ లోక్‌నాథ్.

ఈనెల 30న జ్యోతి పూర్వాజ్ "కిల్లర్" రిలీజ్

జ్యోతి పూర్వాజ్, పూర్వాజ్ ప్రధాన పాత్రలు చేసిన సై ఫై థ్రిల్లర్ సినిమా "కిల్లర్". మనీష్ గిలాడా, చంద్రకాంత్ కొల్లు, విశాల్ రాజ్, అర్చన అనంత్, గౌతమ్ చక్రధర్ కొప్పిశెట్టి ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. పూర్వాజ్ , పద్మనాభ రెడ్డి.ఏ నిర్మిస్తున్నారు. పూర్వాజ్ దర్శకత్వం వహించాడు. ఈ నెల 30న థియేటర్లలో మూవీ రిలీజ్ కానుంది. ఈ నెల 21న ఈ సినిమా ట్రైలర్ రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఓవర్సీస్‌లోనూ "కిల్లర్" మూవీ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఓఎంజి పిక్చర్స్ ఈ సినిమాను ఓవర్సీస్ డిస్ట్రిబ్యూట్ చేస్తోంది. ఈ సంస్థ "కిల్లర్" సినిమాను అమెరికా, యూరప్, కెనడా, అరబ్ దేశాలు, మలేషియా, న్యూజిలాండ్, రష్యా వంటి దేశాల్లో విడుదల చేయనుంది.

Printed, Published and owned by Y. Ramadevi on behalf of NAGAPUBLICATIONS and printed of Koushik Printers, Vidya Nagar, Hyderabad
Published.... 3/5, MIG Flats, KPHB, Hyderabad 500072, Editor Y. Nagaraju, Ph. No. 9059548848 RNI:APTEL/2001/14027